క్లుప్తంగా

కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి: ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. శనివారం పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించారు. అధికారులు ముందస్తుగా ఆయా రాజకీయ పార్టీల వారికి సమాచారం ఇవ్వడంతో, తొలగించిన ఫ్లెక్సీలను నేతలు భద్రపరిచారు.

వడమాలపేట ఎస్ఐగా ధర్మారెడ్డి



పుత్తూరు: వడమాలపేట ఎస్ఐగా ధర్మారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గాజులమండ్యం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుధాకర్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు.

అన్నదానం



అన్నం వడ్డిస్తున్న ప్రతాప్ స్వామీజీ

పుత్తూరు: అన్నిదానాల్లోకి అన్నదానం మిన్న అని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. శనివారం మధ్యాహ్నం అప్పలాయగుంట ఆలయ ఆవరణలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ప్రతిరోజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్న ప్రసాదం అందించడం దైవ కృపగా అభివర్ణించారు.

పోలీసు కవాతు



విజయపురం: మండలంలో సమస్యాత్మకమైన గ్రామంలో సీఐ సుబ్బరామరెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ ఫోర్సుతో కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ రావడంతో విజయపురం దళితవాడ, పన్నూరు, గంగమాంబపురం గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించకుండా, స్వచ్ఛందంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ముందస్తు చర్యలు తీసుకున్నారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సిబ్బంది సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ జయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ



టెన్త్ విద్యార్థులతో ఎంఈఓ, హెచ్‌ఎం

పాలసముద్రం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సిద్ధం చేశామని ఎంఈఓ గిరిజ, హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. శనివారం పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మీనాక్షి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులతో సంఘ నాయకులు

పుత్తూరు: వడమాలపేట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం బహుజన సేవా సంఘం వారు విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. సంఘ అధ్యక్షుడు దిలీప్ కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణ నవనీతం, విద్యాకమిటీ చైర్మన్ ధనుంజయులు, సంఘ నాయకులు భానుప్రకాష్, వెంకటేష్, మునస్వామి, మునెయ్య, సాయి, వినయ్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా హేమలత



పాలసముద్రం: పాలసముద్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా హేమలత బాధ్యతలు చేపట్టారు. ఆమె చిత్తూరు పీసీఆర్ కళాశాలలో జూవాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ప్రభుత్వం ఈమెకు ఇటీవల పదోన్నతి కల్పించింది. తాజాగా ఆమె పాలసముద్రం ప్రిన్సిపల్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తా



నగరి: నా మీద నమ్మకంతో నన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు. మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి అయిన జగనన్న నాయకత్వంలో ఒక మహిళగా మరోసారి నాకు పోటీ చేసే అవకాశం ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికీ రెండుసార్లు జగనన్న ఆదరణ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో విజయం సాధించాను. ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్నిరకాలుగా సేవలు అందించాను. ఈసారి కచ్చితంగా జగనన్న ఆదరణ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో హ్యాట్రిక్ విజయం సాధిస్తా. భారీ మెజారిటీని సాధించి నా తరపున, మా ప్రజల తరపున జగనన్నకి గిఫ్ట్‌గా ఇస్తా. గత ఎన్నికల్లో చెప్పిన మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేసి ప్రజల్లో తిరుగులేని విశ్వసనీయతను జగనన్న సంపాదించారు. గతంలో ఏం చేస్తామో చెప్పి విజయం సాధించాం. ఈసారి ఏం చేశామో చెప్పడమే కాదు.. ఇంకా ఏం చేయబోతున్నామో మా మేనిఫెస్టోలో చెప్పి ప్రజల ఆశీర్వాదం కోరుతాం. జగనన్న పార్టీలో సీటు వస్తే చాలు.. విజయం సాధించినట్టే. జనం ఓటేసేది జగనన్న జెండా, అజెండాకే. జగనన్న సామాజిక న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్ అని మరోసారి నిరూపించుకున్నారు. నగరి గడ్డ జగనన్న అడ్డా అని నిరూపిస్తా.

–ఆర్‌కే రోజా, నగరి అభ్యర్థి

ప్రతి అడుగు ప్రజల కోసమే



కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన నా తండ్రి కళత్తూరు నారాయణస్వామి అడుగుజాడల్లో నడుకుంటాను.. నిస్వార్థంగా లేకుండా నియోజకవర్గ ప్రజలకు అంకిత భావంతో పని చేస్తా అని జీడీనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. ప్రజల కోసం పని చేసేందుకు ఎక్కడా వెనుకాడబోను. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆశయ సాధన కోసం ఇటు పేదల సంక్షేమం, అటు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని సూచించారు. తన తండ్రి నారాయణస్వామిని 2014, 2019 ఎన్నికల్లో ఎలా ఆదరించి అక్కున పెట్టుకున్నారో, అదే తరహాలో నాపై ప్రజలు ఆదరాభిమానం చూపి ప్రజాసేవలో భాగస్వామ్యులను చేసేందుకు పునరంకితం కావాలని తెలిపారు. నిత్యం ప్రజల కోసమే పని చేస్తానని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల మధ్యే ఉంటానని హామీ ఇచ్చారు.

–జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి

అంబరాన్నంటిన సంబరాలు

- వరుసగా మూడోసారి నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్‌కే రోజాకు సీటు కేటాయింపు
- బాణసంచా పేలుళ్లతో నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆనందహేళి
- స్వీట్లు పంచుతూ, విజయకేతనం చూపిన నాయకులు, అభిమానులు



నగరిలో సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

నగరి: వరుసగా మూడోసారి నగరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి ఆర్‌కే రోజాను పార్టీ అధిష్టానం ప్రకటించడంపై స్థానిక నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. శనివారం అభ్యర్థుల జాబితా ప్రకటించే సమయానికి టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్న వారు స్క్రీన్లను ఏర్పాటు చేసుకున్నారు. నగరి అభ్యర్థిగా ఆర్‌కే రోజా అంటూ ప్రకటించగానే టవర్‌క్లాక్ సెంటర్ దద్దరిల్లేలా టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకుని హంగామా చేశారు. పార్టీ శ్రేణుల ఆనందం అవధులు దాటింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ విశ్వసనీయతకు, సేవాతత్పరతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పట్టం కట్టారన్నారు. రోజమ్మపై ముఖ్యమంత్రి పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ శ్రేణులు సైనికుల్లా పాటు పడతామని తెలిపారు. భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని రోజమ్మకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌చైర్మన్లు, వైస్‌ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: నగరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి మంత్రి ఆర్కే రోజాను అధిష్టానం ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు జరుపుకున్నారు. విజయపురం, పన్నూరు, ఇల్లత్తూరు, కేవీపురం, తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు టపాకాయలు కాల్చి స్థానికంగా ఉన్న ఆలయాల్లో పూజలు చేశారు. 2024లో మరోసారి ఎమ్మెల్యేగా మంత్రి ఆర్‌కే రోజాను గెలిపించి రికార్డు సృష్టిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సంబరం..

పుత్తూరు: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆర్కే రోజా పేరును అధిష్టానం శనివారం ప్రకటించింది. దీంతో పుత్తూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నాయకులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. డప్పు వాయిద్యాల మధ్య తమ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, నాయకులు ఇందుమతి, శ్రీనివాసులురెడ్డి, ఏకాంబరం, మనోహర్‌రెడ్డి, వెంకటేశన్‌రెడ్డి, ప్రసాద్, లారీమోహన్, మురళీరాజు, మోహన్‌రెడ్డి, శివారెడ్డి, మునయ్య, లక్ష్మణమూర్తి, రత్నం, ప్రభు, వెంకటేశులు, చిట్టిబాబు, మురళీరెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి రోజా పేరు ఖరారు కావడంతో నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, చంద్రారెడ్డి, యాదవేంద్రరెడ్డి, నందయ్య, కిరణ్‌కుమార్, మునిశేఖర్, మునిబాబు, వెంకటరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, కృష్ణారెడ్డి, రవిరెడ్డి, నాని, సోమశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, బత్తయ్య, రాజారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రం నింద్రలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. మరోమారు రోజాకు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా టికెట్ కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా కార్యదర్శి మేరి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, పార్టీ కన్వీనర్ వేణురాజు, నాయకులు శివలింగ ఆచారి, దామోదరం, రామచంద్రారెడ్డి, రామచంద్రయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



నింద్రలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



వడమాలపేటలో..

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయదేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి



వనదుర్గాపురంలో ఎన్నికల ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

పాలసముద్రం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేసి ఘన విజయం సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ అన్నారు. శనివారం వారు వనదుర్గాపురం పంచాయతీ రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, పెనుమూరు మార్కెట్ డైరెక్టర్ రమాదేవి, సర్పంచ్ నరసింహరాజు పార్టీ కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారరథాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ అలాగే కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం వారు జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ అయ్యప్ప, గాలి మహేష్ బాబు, నాయకుడు షణ్ముగరెడ్డి, ధనుంజయులు, మనోహర్, గోపాల్, వెంకటేష్, కృష్ణయ్య, రవిరెడ్డి, సిద్ధమందడి, కుమార్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 40 కేసులు పరిష్కారం





నగరి: లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జి విష్ణువర్మ, పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 40 కేసులు పరిష్కారం కాగా రూ.59.44 లక్షలు సెటిల్‌మెంట్ అయింది. జడ్జి ఎస్.విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సివిల్, బ్యాంకు కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 40 కేసులు పరిష్కారానికి గురై సెటిల్‌మెంట్ అయ్యాయి. లోక్ అదాలత్‌లో ఏపీపీ రామశాంతి, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో 118 కేసులు పరిష్కారం

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 118 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ. రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.2,20,76,429 రాజీ చేసినట్లు తెలిపారు. 68 క్రిమినల్ కేసులు, 38 సివిల్, 12 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ఆఫీసర్లుగా న్యాయమూర్తులు ఎస్.సి.రాఘవేంద్ర, సి.జానకి, వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. బెంచ్ మెంబర్స్ న్యాయవాదులుగా కె.భాస్కర్, పి.దిలీప్‌రెడ్డి, అమర్‌నాథ్ వ్యవహరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నగరి: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఈవీఎంల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. సరిహద్దు పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రఫీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు నియామకంలో ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పలు పార్టీల ప్రతినిధులు డీఎస్పీ నరసింహమూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని ఉగ్రాణంపల్లికి చెందిన వి.గోవర్ధన్‌రెడ్డి పరిశోధక విద్యార్థికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ గ్రహీత గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కామర్స్ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ పీవీ నర్సయ్య మార్గదర్శకత్వంలో మేనేజ్‌మెంట్ ఆఫ్ వర్కింగ్ క్యాపిటల్ ఇన్ సెలెక్ట్ సిమెంట్ కంపెనీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని ఎస్వీయూలో సమర్పించామన్నారు. అలాగే పలు జాతీయ పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని నియమించడంతో మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మణి ఆధ్వర్యంలో బాణసంచాలు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈసారి గంగాధర నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కృపాలక్ష్మికి అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడమే మన ముందున్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలప్ప, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు జనార్దన్, మణి, ఏసురత్నం, వెంకటేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి అభయం



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వెంకన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తిరుపతి రూరల్: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు, కార్మిక చట్టాలపై శనివారం తిరుపతిలో అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతిలోని రాస్ భవనంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని కార్మిక శాఖాధికారులు, సిబ్బందికి విశ్రాంత ఉప కార్మిక కమిషనర్ అఖిల్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చట్టాలను అమలు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అర్హులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేయడం, లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే పథకాల అములు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరగాడి ఆటకట్టు



నేరస్తుడు బాలాజీ

తిరుపతి క్రైమ్: సైబర్ నేరగాడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐడీ డీఎస్పీ పద్మలత శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. తిరుపతి సీఐడీ కార్యాలయంలో షేక్ ఫయాజ్ ఫిర్యాదు మేరకు తిరుపతి సీఐడీ సైబర్ అనాలసిస్ టీమ్ ఏర్పాటు చేశారని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నది తిరుపతికి చెందిన మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బాలాజీగా గుర్తించామని తెలిపారు. శనివారం బాలాజీని అదుపులోకి తీసుకొని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నివాసి అయిన మరిసర్ల బాలాజీ(34) ఆన్‌లైన్‌లో ఓఎల్ఎక్స్ మోసాలకు పాల్పడుతున్నాడని వెల్లడించారు. సుమారుగా 23 ఆన్‌లైన్ ఫిర్యాదులలో నేరస్తుడిగా బాలాజీ ఉన్నట్లు సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా గుర్తించామన్నారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ ఎనలిస్ట్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకిషోర్, ఎస్ఐ ఫరూక్‌ఉద్దీన్ పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న వారితో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి

ఇంటి పట్టాల పంపిణీ

నగరి: మండలంలోని వీకేఆర్ పురం సచివాలయ పరిధిలో ఇంటిపట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న 45 మందికి రిజిస్టర్డ్ పట్టాలను మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పంపిణీ చేశారు. శనివారం ఉదయం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పట్టాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పేదమహిళలు నేడు ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ఆస్తులకు యజమానులు అయ్యారన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, ఎంపీటీసీ ఇమ్రాన్, సర్పంచ్ నందిని, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చిన సీఎం జగనన్న

నగరి: రాష్ట్రంలో విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చిన నేత జగనన్న అని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం నగరి రూరల్ మండలం మీరాసాహెబ్‌పాలెంలో నాడు–నేడు పథకం కింద రూ.35.05 లక్షల నిధులతో నవీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, రూ.5 లక్షల నిధులతో నవీకరించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి, ఎంపీటీసీ ఇమ్రాన్, సర్పంచ్ నందిని, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మీరాసాహెబ్‌పాలెం ముస్లింలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నగరి: మండలంలోని దేశూరు అగరం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అంచనా విలువ రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ మాతమ్మ ఆలయానికి రామ్‌ప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



ఎం.కొత్తూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

నగరి: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తిరుపతి డివిజన్ ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పన్నూరు, నింద్ర, కాశికాపురం, కొప్పేడు, ఎం.కొత్తూరు సబ్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్లలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానిక అధికారులను ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు, ఆపై ఎన్నికలు ఉన్నాయి కనుక విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అందిస్తామన్నారు. గ్రామాలకు విద్యుత్ సరఫరాకు విడిగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, వాటి వల్ల భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సబ్సిడీపై సోలార్ ప్లేటు ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునే పథకంపై విద్యుత్ శాఖ అవగాహన కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ ఎం.చిన్నరెడ్డెప్ప, డిప్యూటీ ఈఈ ఎ. వెంకటముని, ఏఈలు మోహన్‌రావ్, లోకనాథరావ్ పాల్గొన్నారు.

